

# చిక్కని చుక్క

ఆ చక్కని చుక్క ఎదురింట్లో దిగకపోతే గోపాలానికి ఇన్ని కష్టాలు వచ్చేవి కావు. ఆ కళ్ళేమిటి! ఆ ముక్కేమిటి!! వరే...వా! కళ్ళు చక్రాల్లా తిరుగుతుంటే దారిపోయేవాళ్ళు గిరికీలు కొట్టేస్తున్నారు. ముక్కు రామబాణంలా కొనతేలి ఉంది.

పాపం ఆ అమ్మాయి మటుకు ఏం చేస్తుంది. నడుస్తుంటే ముక్కు మనుష్యులకు తగులుతుందేమోనని అటూ ఇటూ ఊపుకుంటూ నడుస్తుంటే... పాపిష్టి జనం కదా... ఆ ముక్కు ఒక్కసారి తగిలితే బాగుండు... అని... అటుపక్కకే వస్తుంటే గుండెకాయ గోడగడియారం పెండ్యులాం మాదిరిగా ఊగి ఊగి దడదడలాడుతోంది. గుండెకాయ ఊడిరాదుగాని, వస్తే కోతి గుండెకాయలాగా బయటకు తీసేసి సంచీలో వేసుకుని నిశ్చింతగా వెంట నడవచ్చు అన్న కోరికలు గూడా చెలరేగడం మొదలెట్టాయి... పాపిష్టి జనం కదండీ!

ఆ అమ్మాయి తోటి ఒక ముసలాయన. వాలకం చూస్తే షష్టిపూర్తి అయినట్లే ఉంటుంది. జుట్టుకి రంగు, రంగు రంగుల చొక్కా, ఈ కరువు రోజుల్లో గూడా బంగారుపళ్ళు కట్టించుకున్నాడంటే అతనికి ఎంత ఆస్తి ఉందో ఊహించుకోవచ్చు. ఆ పళ్ళు ఊడగొట్టి అమ్ముకున్నా ఓ పెద్ద కుటుంబం ఓ ఏడాదిపాటు దివ్యంగా బ్రతకవచ్చు. ఈ వయస్సులో పిల్లని ఎవరిస్తారా అన్న ప్రశ్న అక్కరలేదు. నాలుగు కార్లు కొని దిక్కుకో కారు నడుపుకోవలసినవాడు స్కూటరు మీదనే తిరుగుతాడు. అంత వయస్సు వచ్చినా సిగ్గూ, ఎగ్గూ లేకుండా ఆ అమ్మాయిని వెనకేసుకుని తిరుగుతాడు. అప్పుడు చూడాలి వాళ్ళ జోరు. ఆ అమ్మాయి అతన్ని గట్టిగా...

ఎంత గట్టిగా పట్టుకుంటుందంటే... ఆ ముసలాయన ఊపిరాడక చచ్చిపోతాడేమోనని భయం వేస్తుంది చూసేవాళ్ళకి. అయితేనేం ఆయన చావనూ లేదు. ఈమె వదలనూ లేదు.

ఆ అమ్మాయి రంగు ఎరుపో, తెలుపో, మేలిమిఛాయనో ఇదమిత్థమని చెప్పలేం. కళ్ళు జిగేలుమంటుంది. ఏ రంగు చీరె కడితే దుద్దులూ, బొట్టూ, ఆభరణాలు ఆ రంగువే ఉండటం కాకుండా... ఆమె ముఖఛాయకూడా ఆ రంగులో దేదీప్యమానంగా వెలిగిపోతుంది. సీతారాముల కళ్యాణంలో ముత్యాల తలంబ్రాలు పోసుకుంటుంటే అమ్మవారి అరిచేతికెంపు, రంగూ, అయ్యవారి శరీరఛాయలో ముత్యాల రంగులు మారిపోయినాయని చెప్పుకుంటారు. ఆమె శరీరం రంగులు మార్చుకునే తెల్లటి మంచిముత్యం లాంటిది అన్నమాట.

ఆ ఇంట్లోకి అద్దెకు ఎవరు వచ్చినా పార్వతికి వచ్చిన నష్టం లేదు. ఎప్పుడూ దొడ్లో జామచెట్టుకింద చెట్టుకానుకుని కాఫీ తాగుతూ వార్తాపత్రిక చదివే గోపాలం ముందు వరండాలోకి వచ్చి పేపరు అడ్డుపెట్టుకుని అందాలరాశివంక తేరిపార చూడటం పార్వతి కంటపడింది. పార్వతి మెల్లిగా కాఫీగ్లాసు తీసుకుంటూ "పేపరు తిరగేసి పట్టుకున్నారు..." అంది. గోపాలం ఉలిక్కిపడి పేపరు వంక చూశాడు. సరిగానే ఉంది. "ఏంటి మాట్లాడుతున్నావ్..." అన్నాడు కొద్దిగా తొట్రుపాటుపడుతూ.

"కాఫీగ్లాసు అందుకుంటూ వంగి కిందనుంచి చూశాను గదా... అప్పుడు పేపరు తిరగేసినట్లు కనిపించింది" అంది పార్వతి నవ్వుతూ.

"ఈ మధ్య నీకన్నీ తలక్రిందులుగానే కనిపిస్తున్నాయి... గమనిస్తున్నాను..."

"నేనూ గమనిస్తూనే ఉన్నాను... మీరు కథలు వ్రాయటం మానేసి కలలు కనటం మొదలుపెట్టారు..."

గోపాలం ముఖం కొంచెం ఎరుపెక్కింది.

"నిన్న ఎదురింటికి వెళ్ళాను. చాలా మర్యాదస్థుల్లాగా ఉన్నారు. మీ పేరు చెప్పాను... కథలు వ్రాసే గోపాలం మీరని తెలిసి ఆ అమ్మాయి ఎగిరి గంతేసింది... పక్కనే భర్త ఉన్నాడన్న సంకోచం కూడా లేకుండా..."

గోపాలం చెవులు చేటంత అయ్యాయి. చీమ చిటుక్కుమన్నా వినగలిగేటంత సున్నితంగా, నాజూగ్గా తయారయినాయి.

"వాళ్ళ గొడవ మనకెందుకు...!" అన్నాడు గాని ఆ అమ్మాయి ఇంకేమి మాట్లాడిందో తెలుసుకోవాలన్న కుతూహలం అత్తరు వాసనలా వ్యాపించేస్తోంది."

"కట్నం సరిపోలేదనీ, కానుకలు తక్కువ అయ్యాయనీ, పిల్లకు తగినంత చదువు లేదనీ, ఉద్యోగం చెయ్యటం లేదనీ... ఇట్లా వంద సాకులు పెట్టి పెళ్ళిచేసుకోకుండా ముప్పైలూ, నలభైలూ వచ్చినా పోరంబోకుల్లా వీధివెంబడి తిరిగే యువతరం కన్నా.. ధైర్యంగా పెళ్ళిచేసుకున్న ఆ ముసలాయనే నయమని నా ఉద్దేశం..." అంది పార్వతి. గోపాలం పేపరు మడిచేశాడు.

"అయితే... వాళ్ళిద్దరూ..." గోపాలం నసిగాడు.

"ఆ... ఆ... మొగుడూ పెళ్ళాలు... మీకేమయినా ఇబ్బందిగా ఉందా..."

"ఏం మాట్లాడుతున్నావ్..."

"తెలుగు... ముసలో... ముతకో... పెళ్ళిచేసుకున్నవాడే మగాడని నా ఉద్దేశం..." పార్వతి ఫక్కుమని నవ్వేసింది. గోపాలానికి దుఃఖం వచ్చింది. కొంత ధైర్యం వచ్చింది. తను అటువంటి వెధవపని చెయ్యలేదు. పాతిక దాటకుండానే పెళ్ళిచేసుకున్నాడు.

"అంతా నా మాదిరే ఉంటారా... ఎవరికి తగిన ఇబ్బందులు వాళ్ళకుంటాయి" ఆత్మస్తుతి, పరనింద మేళవించాడు.

"అబ్బో... మీ సంగతి... బడాయి చెప్పుకోవాలి... మూఢమని మూడునెలలూ... ఆషాఢమని ఆరునెలలూ... చైత్రంలో పెళ్ళిచూపులయితే... ఫాల్గుణంలో అయ్యగారింట్లో కాలుపెట్టాను... దమ్ములున్న మగాడయితే ఏం చేస్తాడో తెలుసా..." పార్వతి ధాటికి గోపాలం నివ్వెరపోయాడు.

"అట్లా నోరు తెరుచుకుని చూస్తారెందుకూ... పొద్దున పెళ్ళిచూపులయితే... రాత్రికి కాపురం పెట్టాలి. పూజలూ... పునస్కారాలు... విందులు, వినోదాలు, తతంగాలూ అన్నీ ఏడాది పొడుగునా చేసుకోవచ్చు... ఏ ఆడదానికయినా అట్లాంటి వాడిమీదనే గౌరవం ఉంటుంది. లేకపోతే మనమాదిరే... కట్టుకున్నాం గదా... కాపురం చెయ్యటం..." పార్వతి గబగబా మాట్లాడేస్తుంటే గోపాలం గుక్క తిప్పుకోలేకపోయాడు. తను నమ్మిన సత్యాలూ, నిజం అని భ్రమపడ్డ ప్రేమలూ అంతా తమాషా అన్న మాట. తనకన్నా ఆ ముసలాడే నయమన్నమాట. ఇన్నివందల కథలు వ్రాసి పారేసిన తనకు ఇంత చిన్న సత్యం తెలీదన్నమాట. ఛ...

"ఏమిటీ అట్లా బిగుసుకుపోయారు. కొంచెం వేడివేడి కాఫీ తెస్తానుండండి' పార్వతి నడచి వెళ్ళిపోతుంటే గోపాలానికి అదోలా అనిపించింది. పార్వతి తన భర్త, తను ఆమె భార్య అయి ఉంటే ఎంత బాగుండేది. పెళ్ళి అయిన ఏడాదికి కాపురం పెట్టాడు... నిజమే... పార్వతి చెప్పిన దాంట్లో అబద్ధం లేదు. తను ఎందుకు అట్లా చేశాడు?

పార్వతి కాఫీ తీసుకువచ్చింది. గ్లాసులో కాఫీ కొంచెం తాగి చూసి "పంచదార సరిపోయింది లెండి..." అంటూ చేతికందించింది. "ఎంగిలి కాఫీ తీపి ఎక్కువ అవుతుందనుకునేరు... సరిగ్గా సరిపోయింది."

గోపాలం కాఫీ అందుకుని "ఇప్పుడు నీకేం కావాలి..." ఎదురింటివైపు చూస్తూ అడిగాడు. ఎదురింటి అమ్మాయి కిటికీ కర్టెన్లు సర్దుతోంది.

"కడసారి పిల్ల పుట్టింతర్వాత కథలు వ్రాయటం మానేశారు. దానికప్పుడే ఎనిమిదో ఏడు వచ్చింది..." పార్వతి చేతివేళ్ళు లెక్కపెడుతోంది.

"పిల్లలు చాలని నువ్వేగా చెప్పింది..."

"కథలు గూడా చాలని చెప్పానా..."

"కథలు చెప్పటం... వ్రాయటం... అప్పటినుంచి మానేశాను..." అన్నాడు గోపాలం కాలరు సవరించుకుంటూ.

"కాలరు సవరించుకునేటంత గొప్ప పనేం చేయలేదు ఇప్పుడు..." అంది పార్వతి. గోపాలం మీద వాలిపోయి కాలరు మెలిక తీసి జేబులు తడిమింది... ఖాళీ.

"మీ బుర్ర బాగానే పన్జేస్తున్నదండి... ఇంక ఆలస్యం... దేనికి..." ఎదురింటివైపు చూస్తున్న గోపాలాన్ని తనవైపుకు తిప్పుకుంది.

"ఈ నలుగురు ఆడపిల్లలకు పెళ్ళి చేసింతర్వాత... అప్పుడు మళ్ళీ సెకండు బ్యాచి పిల్లలను కందాం..."

"పిల్లలను కనటానికి తొందరేముంది... కథ రాయటం సంగతి నేనడిగేది.."

పార్వతి కథల గురించి ఇంత ఊదరపెడుతోంది అంటే సారస్వతం మీద అభిలాష కాదు. గోపాలం కథలు చదివి దేశం బాగుపడుతుందని కాదు. కథ అచ్చయిన వారానికో పది రోజులకో నాలుగు డబ్బులు పోస్టుమాన్ తెచ్చిపెడితే "ఫర్ గోపాలం..." అని సంతకం పెట్టి

తీసుకోవచ్చు. ఓ చీరెనో, జాకెట్టో కొనుక్కోవచ్చు. అందుకోసం సామదానభేద దండోపాయాలు ప్రయత్నించి చూసింది. అయిదో ఉపాయం ఏమిటో అప్పటికీ ఇప్పటికీ తెలియలేదు. తనకు చెప్పినవారూ లేరు. బ్రతిమిలాడింది. ఇష్టమయిన టిఫిన్లు చేసి పెట్టింది. పోచికోలు కబుర్లు చెప్పి స్నేహితులతో మైత్రి చెడగొట్టింది. దండోపాయానికి ప్రత్యామ్నాయంగా పలకరించటం మానేసింది. రాజుకంటే బలవంతుడు ఇట్లా ఉంటాడు కాబోలు అని పార్వతి కొంతకాలం సరిపెట్టుకుంది కూడా. ఈ పరిస్థితుల్లో ఎదురింట్లో కొత్తవాళ్ళు అద్దెకు దిగారు. దానితోటి కథ ముందుకు సాగింది.

గోపాలం వైఖరిలో, నడవడిలో చెప్పుకోదగ్గ మార్పు వచ్చింది. ఏ రోజుకారోజు ఇస్త్రీ బట్టలు తొడగటం మొదలుపెట్టాడు. సాయంకాలం గూడా స్నానం చేస్తున్నాడు.

"ఈ వేషాలకేం కాని... మీరు 'మంచిముత్యం' అని కథ వ్రాశారే ఆ కథ ఓసారి కావాలిటండి... ఎక్కడుంది...?"

"ఎవరికి కావాలిట..." గోపాలం యధాలాపంగా అడిగాడు

"ఇంకెవరికి?.... మన ఎదురింటి అభిమానికి...!"

"ఎక్కడో పడేశాం కథలన్నీ... ఎక్కడున్నాయో... ఏమిటో..." గోపాలం ఇల్లు మారి వచ్చినప్పుడు అచ్చయిన కథలన్నీ ట్రంకుపెట్టెలో పెట్టి అటక ఎక్కించాడు. కొన్ని బీరువా ఫైళ్ళలో ఉన్నాయి. ఈ కథ ఎక్కడుందో ఏమో?"

"పోనీలెండి... ఆ పిల్ల మోజుపడి అడిగింది... మీ ఇష్టమయితే ఇవ్వండి... లేకపోతే లేదు..." పార్వతి గబుక్కున లేచి ఎదురింటికి వెళ్ళింది. ఆ చక్కని చుక్క తలుపు తీసి పార్వతిని లోపలకు ఆహ్వానించింది. గోపాలం ఎదురు చూస్తూనే ఉన్నాడు. ఎంతకూ రాలేదు. తనూ ఓసారి వాళ్ళింటికి వెళ్ళి మాట్లాడి వద్దామని అనిపించింది. అపార్థం చేసుకోవచ్చు. ప్రమాదం. ప్రమోదం! అర్థం చేసుకోవచ్చు. అది మరీ ప్రమాదం!! గోపాలం తికమక పడ్డాడు. ఇంట్లోకి వాకిట్లోకి కాలు కాలిన పిల్లిలా తిరిగాడు. గబగబా అటక ఎక్కి ట్రంకుపెట్టె దించి ఆమె అడిగిన కథ దొరుకుతుందేమో చూద్దామనుకున్నాడు. ఈలోపున పార్వతి వచ్చేసిందంటే తన తత్తరపాటు చూస్తుందేమో? గోపాలం అటక ఒకసారి ఎక్కి ట్రంకు పెట్టె ఎక్కడ ఉందో చూద్దామనుకున్నాడు. మూత తీసి ఉంటే ఎలుకలు లోపలికి దూరి తన కథలన్నీ ఎడా పెడా చదివేసి జీర్ణం చేసుకున్నాయేమో! గోపాలం గదిలోకి వచ్చి బీరువా తెరువబోతుంటే పార్వతి వచ్చిన అలికిడి అయింది. ఫైలు లోపల పెట్టేసి ఓ చొక్కా తీసి తగిలించుకుంటూ నిలబడ్డాడు.

పార్వతి చేతిలో రెండు ఆపిలు పళ్ళున్నాయి. ఒకటి గోపాలం చేతిలోపెట్టింది. "ఆ అమ్మాయి... మీకిమ్మంది...". గోపాలం ఆపిలుపండు అందుకున్నాడు. "అప్పుడే తినకండి... ఏదన్నా కొత్త కథ ఒకటి... వ్రాస్తూ తినండి... మజా వస్తుంది... మీతోటి ఓ ముఖ్యమైన విషయం చెబుదామనుకున్నాను. ఎటో బయలుదేరినట్లున్నారు!?"

"అబ్బే... ఎక్కడికీ లేదు..."

"చొక్కా తగిలించారు మరి"

"చలి వేస్తుంటేనూ..."

"ఎవరికి...?" పార్వతి అడిగిన ప్రశ్నకు గోపాలం తికమక పడ్డాడు. చలి ఎవరికి? తనకా? పార్వతికా? ఎదురింటి అమ్మాయికా?

పార్వతి నవ్వు దాచుకుంటోంది.

"మీరు వ్రాసిన మంచిముత్యం కథలో పాత్రకూ, ఆమెకూ ఎంతో సామ్యం ఉందట. అందుకని ఆ కథ కావాలని మరీ మరీ అడుగుతోంది... ఈ మధ్యకాలంలో ఆమె జీవితంలో అనేక మలుపులు, చివరికి ఈ ముసలాయనతో పొత్తు... వివరాలు చెబుతుంటే కళ్ళలో నీళ్ళు తిరిగాయి..." పార్వతి చీరెకొంగుతో కళ్ళు అద్దుకుంది.

"ఆడదయి పుట్టటం కంటే... అడవిలో రాయిగా ఉండటం మంచిది..."

"ఎందుకని..."

"మగవాళ్ళ మనస్సులు రాతికంటె కఠినంగా ఉంటున్నాయి..."

"ఇప్పుడేమయింది..."

"అభం శుభం ఎరుగని ఆ పిల్ల సంగతులన్నీ వింటుంటే... లోకంలో ఇంతటి విపరీత పరిస్థితులుంటాయని... మనిషిలో నిక్షిప్తంగా ఇంతటి దురాగతమైన భావాలు... ఉద్దేశాలు ఉంటాయంటే నమ్మలేకుండా ఉన్నాను."

"ఆ అమ్మాయి... ఏం చెప్పింది...?"

"ఏం... విని కథ వ్రాసుకుంటారా...?"

గోపాలం నివ్వెరపోయాడు. తనకెప్పుడూ అటువంటి నీచమైన భావాలు లేవు. మరి తనకు ఆమెను గురించి తెలుసుకోవాలని కుతూహలం ఎందుకు కలిగింది? అహం దెబ్బతింది.

"పోనీ చెప్పొద్దులే..." గోపాలం అక్కడినుంచి లేచిపోయాడు. పార్వతి తన చేతిలో ఆపిలు ముక్కలు కోసి పిల్లలకు పెట్టి తనొక ముక్క తింది. గోపాలం పండు తీసుకెళ్ళి తన టేబులుమీద పెట్టుకున్నాడు. పార్వతి ఎదురింటిపిల్ల విషయం చెబుతుందేమోనని ఎదురుచూశాడు. కాని పార్వతి ఇంటిపనులు చక్కబెట్టుకుని దుప్పటి కప్పుకుంది. ఉలుకూ పలుకూ లేదు.

గోపాలం అర్ధరాత్రి లేచి మెల్లిగా చప్పుడు కాకుండా వంటింట్లోకి వెళ్ళాడు. దొడ్లోనుంచి నిచ్చెన తెచ్చుకుని అటకమీదనుంచి ట్రంకుపెట్టె దించాడు. అన్నీ గాలించాడు. మంచిముత్యం దొరకలేదు. మళ్ళీ పెట్టె అటకమీద పెట్టేసి ఏమీ ఎరగనట్లు వచ్చి మంచంమీద పడుకున్నాడు. పార్వతి దుప్పట్లో కదలిక లేదు. "పెట్టెలో కథ కనిపించలేదా...?" అన్నది.

"మేలుకునే ఉన్నావా...?"

"చొక్కా వేసుకోలేదు... దుప్పటి తెచ్చుకోలేదు... చలి వేయటం లేదా? సాయంకాలమే చలికి వణికిపోయారు" పార్వతి నవ్వు వినిపిస్తోంది కాని కనిపించటం లేదు.

"ఆ అమ్మాయికి ఈ పెళ్ళి ఇష్టం లేదుట..."

"మరి ఎందుకు చేసుకుంది...?"

"ఆస్తి కలిసివస్తుందని పెద్దవాళ్ళు బలవంతం చేశారుట..."

"పెద్దవాళ్ళలో అంతా మగవాళ్ళే గానీ... ఆడవాళ్ళు లేరా...?"

"ఆడవాళ్ళ మాట వినే మగవాళ్ళు గూడా ఉన్నారా లోకంలో?"

గోపాలం ముభావంగా పడుకున్నాడు. నిద్ర లేచేటప్పటికి ఎదురింటి అమ్మాయి అప్పటికే లేచి తలంటి పోసుకున్నట్లుంది. జుట్టు ఆరపెట్టుకుంటోంది. గబగబా లేచి వాకిట్లోకి వచ్చాడు. పార్వతి కూడా తలంటి పోసుకున్నట్లు తలకు తువ్వాలు ఒకటి పెట్టుకుంది.

"ఏంటి విశేషం..."

"అమ్మవారి గుళ్ళో కుంకుమ పూజ ఈ రోజు..."

"ఎప్పుడు...?"

"ఇప్పుడే... తొందరగా కాస్త ముఖం కడుక్కుని రండి... గుడిదగ్గర దించుదురు గాని..."

ఆ ఎదురింటి అమ్మాయి గూడా ఈ పూజకోసమే రెడీ అవుతోందా? తనకెందుకు? గోపాలం ప్రశ్నించుకుంటున్నాడు. కాని సమాధానం సంతృప్తికరంగా దొరకటం లేదు.

"అన్నట్లు మీతో చెప్పటం మరచిపోయాను... ఆ అమ్మాయి గూడా గుడికి వస్తోంది... వాళ్ళ స్కూటరు చెడిపోయిందిట... మన స్కూటరు ఓసారి వాళ్ళకిచ్చినా సరే... లేకపోతే ఇంకో ట్రిప్పు అవుతుంది. ఆ అమ్మాయిని గూడా మీరు గుడి దగ్గర దించినా సరే అంది అమ్మాయి..." పార్వతి ముఖం పసుపుకుంకుమలతో నిండినట్లుగా ఉంది. ఆమె కళ్ళల్లోకి సూటిగా చూడలేకపోయాడు. స్కూటరుమీద అమ్మాయిని గుడిదాకా తీసుకెళ్ళి దించితే తప్పేముంది? దారిలో తన కథ చెపితే వినవచ్చు. కథ ఇంటి దగ్గర ఎవరి కుర్చీలో వాళ్ళు కూర్చుని వినవచ్చు. స్కూటరు మీద కూర్చునే కథలు చెప్పుకోవాలా! తనకు తను చెప్పటమా... వద్దా!

"ఎందుకు అంత మీనమేషాలు లెక్కపెడుతున్నారు... ఇవ్వాళ ఆటోవాళ్ళ స్ట్రయికు లేకపోతే మిమ్మల్ని బ్రతిమిలాడాల్సిన అవస్థ ఉండేది కాదు..."

పార్వతి విసవిసా నడుచుకుంటూ పోయింది. ఆటోవాళ్ళకు శ్రీరామరక్ష! గాడ్ బ్లెస్ దెమ్! గోపాలం క్షణాల మీద ముఖం కడుక్కుని గడ్డం చేసుకుని, పౌడరు కొట్టుకుని ఇస్త్రీ బట్టలు వేసుకుని, స్కూటరు బయటకు తీసి రెడీ అయ్యాడు. కొంచెం ఫ్రెంచి సెంటు రాసుకుందామనుకున్నాడు. పార్వతి పూలు, పళ్ళు తీసుకొని ఎదురింటి అమ్మాయితో మాట్లాడి వచ్చింది. స్కూటరు మీద కూర్చుంటూ "అత్తరు వాసన వస్తోంది. సెంటు రాసుకుందామనుకున్నారా?"

"నీకు ఎగతాళిగా ఓంటుంది..."

"చక్కగా కథలు రాయకూడదా మళ్ళీ..."

"రాయాలనే ఉంది!"

"మంచిముత్యం కథ చూడండి... ఇప్పటికీ గుర్తు పెట్టుకున్నారు అభిమానులు"

"ఆ కథ ఎక్కడ ఉంది?"

"ఇంకోటి వ్రాయండి... ఆ అమ్మాయి ఎవరో తెలియకుండానే మీరు మంచిముత్యం కథ వ్రాశారు. ఇప్పుడు 'అరగని వజ్రం' అనో 'తరగని పగడం' అనో వ్రాయచ్చు!"

"చూద్దాంలే... నిన్ను దింపేసి వచ్చింతర్వాత... స్కూటరు ఆయనకు ఇచ్చేయనా?"

"వద్దు... వద్దు... మిమ్మల్నే ఒక ట్రిప్పు దింపమని అడిగారు వాళ్ళు."

గోపాలం సంతోషం, ఉత్సాహం పార్వతికి కరతలామలకంలా ఉన్నది.

"మీ వాలకం చూస్తే ఈసారి ట్రిప్పుకుసెంటు రాసుకుని వచ్చేట్లున్నారు. ఆ అమ్మాయి జాగ్రత్త... మరీ గట్టిగా పట్టుకుంటుంది. స్కూటరు మీద ప్రయాణం కొంచెం భయంట... మీరు వెర్రివేషాలు వేస్తే... ఆ అమ్మాయి చెప్పేస్తుంది నాకు జాగ్రత్త... సుమా!" అంది పార్వతి.

గోపాలం స్కూటరు గాలిలోంచి మళ్ళీ నేలమీద పరుగెత్తడం మొదలెట్టింది. గుడినుంచి తిరిగి వచ్చిన తర్వాత స్కూటరు ఎదురింటి దగ్గర ఆపాడు. చక్కని చుక్క ఎప్పుడు వస్తుందా అని ఎదురుతెన్నులు చూశాడు. ఈలోపున ముసలాయన వచ్చి స్కూటరు అడిగి తీసుకుంటాడో, నాలుగుచ్చుకుని, ఎడా పెడా వాయించేసి ఒళ్ళు ఎట్లా ఉంది అని అడుగుతాడో! గుండె కాసేపు కొట్టుకొని ఆగి తన ఆరాటానికి మీటరులాగా పనిచేస్తోంది.

ముసలాయన ముందుగా బయటకు వచ్చాడు. చేతిలో లాఠీ ఉంది. వెనకాలే ఆ అమ్మాయి వచ్చింది. గోపాలం స్కూటరు స్టార్టు చేశాడు.

"అయాం... సుదర్శన్!" అన్నాడు ముసలాయన కరచాలనం చేస్తూ.

"అయాం గోపాలం!" అన్నాడు గోపాలం లాఠీ వంక చూస్తూ. అమ్మాయి కూడా పరిచయం చేసుకుంటుందేమో! కరచాలనం చేస్తే ముసలాయన చంపేస్తాడు. అమ్మాయి టా...టా... చెప్పి స్కూటరు మీద కూర్చుంది. గుడికి పార్వతితో ఆఘమేఘాలమీద వెళ్ళి వచ్చినవాడు అమ్మాయితో నిదానంగా తెరచాప పడవ ప్రయాణం ఆడుతూ పాడుతూ చేరుకున్నాడు. పార్వతి ఎదురుచూస్తోంది.

"అమ్మాయి జాగ్రత్తగా కూర్చుందా?" పార్వతి కొంటెగా అడిగింది.

"ఆ...!"

"గట్టిగా పట్టుకుందా...!"

"అమ్మాయిని అడుగు"

"ముసలాయన ఏమైనా గొడవ చేశాడా?"

"లేదు"

"మీరేమన్నా వెర్రివేషాలు వేశారా?"

"అమ్మాయిని అడుగు"

"చెప్పుకోవడానికి మీరే సిగ్గుపడుతున్నారు. చిన్నతనం ఆ అమ్మాయి ఏం చెపుతుంది?"

"నలుగురు పిల్లలు... నీకేమన్నా బుద్ధి ఉందా? ఇట్లా మాట్లాడడానికి... అందులోనూ గుళ్లో...!"

"నలుగురు పిల్లలయితే ఏమయింది? ఈ బ్రహ్మాండంలో అనంతకోటి జీవరాసుల్ని సృష్టిస్తున్న బ్రహ్మదేవుడికే పుట్టు రిమ్మతెగులు... అని వెనుక చెప్పాడుటగా!" .

పార్వతికి ఇంత భాషా పరిజ్ఞానం ఎక్కడినుంచి వచ్చిపడింది. ఆమెకు యక్స్-రే కళ్ళు ఉన్నట్టున్నాయి.

"మీరు మళ్ళీ కథలు వ్రాస్తారేమోనని ఇవన్నీ భరిస్తున్నాను" అంది పార్వతి గుళ్ళోకి వెళ్ళిపోతూ.

గోపాలం గుడి అంతా తేరిపార చూశాడు. వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, రాములవారు, ఆంజనేయుడు, ఈశ్వరుడు, అమ్మవారు... ఒకరేమిటి... ఎంతమంది దేవుళ్ళో... వేమన్న చెప్పింది నిజమే అయి ఉండాలి. అందుకనే బ్రహ్మను గుడిలోనికి రానీయలేదు. గోపాలం రివ్వున ఇంటికి వెళ్ళిపోయాడు. మనసు మనసులో లేదు. వస్తూ ఓ దస్తా తెల్లకాగితాలు పట్టుకెళ్ళాడు. ఎప్పుడూ కథలు వ్రాసే పెన్ను బయటకు తీశాడు. ఆ అమ్మాయి తన కథ ఏమని చెప్పింది. ఆ ముసలాయనతో సంసారం ఇష్టంలేనట్లు ఎక్కడా కనిపించలేదు. ఆయన కనిపించగానే ముఖం విప్పారి, కళ్ళు కేరింతలు కొడుతున్నాయి. కంటిరెప్పలు టపటపలాడుతుంటే కవలపిల్లలు కిలకిలలాడుతున్నట్లే ఉన్నాయి. ఎక్కడా ఏ కోశానా దుఃఖంగాని, బాధగాని, వ్యాకులం గాని కనిపించనే లేదు. అంతా నటనా! తనతో స్కూటరు మీద వచ్చినప్పుడు తన కథ అంటే ఇష్టమని గాని, తనంటే ఇష్టమని గాని, తన కథగాని చెప్పుతుందేమో అనుకున్నాడు. అంటీ అంటనట్లు కూర్చుంది. కనీసం భుజం మీద చెయ్యి కూడా వెయ్యలేదు. దిగినప్పుడు 'థ్యాంక్స్' అంది. తనవంక కూడా చూడలేదు. ఆమె కథ ఏమని వ్రాస్తాడు.

"మంచిముత్యం' కథలో ఏం వ్రాశాడో కూడా గుర్తులేదు.

పార్వతి పూజలు పూర్తిచేసుకుని వచ్చింది. చక్కనిచుక్క కూడా వచ్చింది. వంటింట్లోకి వెళ్ళి దేవుడికి దణ్ణం పెట్టుకుని బయటకు పోతూ తనకు కూడా దణ్ణం పెట్టింది. ఏమని మొక్కుకుంది. తననుంచి ఏం కోరుకుంటోంది!

గోపాలం ఆ రోజు ఆఫీసు మానేశాడు. భోజనం అయిన తర్వాత కథ ఒకటి ప్రారంభించాడు. ఆ అమ్మాయి గురించే వ్రాయాలి. తన మనస్సులో కలిగిన భావాలన్నీ కథారూపంలో మలిచాడు. రాత్రి భోజనాలయిన తర్వాత పడుకుంటూ దుప్పటి దులుపుతుంటే దిండు కింద అచ్చు కాగితాలేవో కనిపించాయి. గోపాలం దిండు తీసి చూశాడు. తన కథ 'మంచిముత్యం'. "ఇక్కడికెలా వచ్చింది" పార్వతిని తెల్లబోతూ అడిగాడు.

"నేనే పెట్టాను"

"నువ్వా! ఎందుకని?"

"ఈ మధ్య మీ కథలు తీసి చదివాను. ఈ కథ బాగుందని మళ్ళీ చదివి దిండుకింద పెట్టాను."

"మరి నాతో ఎందుకు చెప్పలేదు?"

"ఆ అమ్మాయిని చూడగానే ఈ కథ జ్ఞాపకం వచ్చింది. భార్య మీ అభిమాని కావటం ఇబ్బందిగా ఉందా?"

గోపాలం ఏమీ మాట్లాడలేకపోయాడు.

"మరి ఎదురింటివాళ్ళు?"

"ఆ ముసలాయన ఇక్కడ ఏదో ఫ్యాక్టరీ పెట్టబోతున్నాడుట. మనుమరాలు మారాం చేస్తే వస్తూ వస్తూ తీసుకువచ్చాడుట". పార్వతి నవ్వుతుంటే ఆ నవ్వుల తెరలకు తన ఊహాగానాలన్నీ చెల్లా చెదురయిపోతున్నాయి. తను వ్రాసిన కథలో చిన్నపిల్లను ముసలాయన పెళ్ళిచేసుకున్న సాంఘిక విపరీతపరిస్థితులకు గొప్ప విశ్లేషణ చేశాననుకున్నాడు. చకచకా వెళ్ళి ఆ కాగితాలన్నీ చింపి పారేద్దామనుకున్నాడు. పార్వతి అడ్డుపడింది.

"మీరు మళ్ళీ కథలు వ్రాయాలి. మన బట్టలు వేసేటప్పుడు పడుగూ పేకా అంటాం చూశారా! వాస్తవం ఊహా అవే... సంసారంలో మనిద్దరిలాగా!"

పార్వతి నవ్వుతుంటే గోపాలం దూదిపింజలాగా గాలిలోకి చెదిరి ఎగిరిపోతున్న ఊహల్ని పోగుచేసుకుంటున్నాడు. కొంచెం మనసు కుదుటపరచుకుని "ఓ.కె. నువ్వే గెలిచావు. ఆ అమ్మాయికి నా కథలంటే ఇష్టమనీ, మంచిముత్యం కథ అడిగిందని అన్నావు. నేను మళ్ళీ కథలు వ్రాస్తాను. 'మంచిముత్యం' ఆ అమ్మాయికివ్వు. చదువుకుంటుంది."

"వద్దులెండి. వాళ్ళు గుజరాతీవాళ్ళు. తెలుగు రాదు."

గోపాలం ముఖం కథ రాయని తెల్లకాగితంలా అయింది.

"కంగారు పడకుండా కొత్త కథ వ్రాయండి."

"ఆ చక్కని చుక్క గురించేనా!" గోపాలం కుదుటపడి నవ్వాడు.

"అవును... అయితే కథ పేరు 'చిక్కనిచుక్క' అని పెట్టండి."

గోపాలం వ్రాయబోయే కథకు రాబోయే డబ్బుతో ఏ రంగు చీర కొందామా అని ఆలోచనలో పడ్డది పార్వతి.

(జాగృతి - దీపావళి కథల ప్రత్యేక సంచిక, 1991)